ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

ఓటర్లంతా వైఎస్ జగన్ వైపే..

– వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం నల్లేరుపై నడకే
– ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి

కమలాపురం: రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఓటర్ల మనోభావాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైపే ఉన్నాయని, వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థుల విజయం నల్లేరు పై నడకేనని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం కమలాపురం పట్టణంలో ఎన్నికల పోలింగ్ సరళిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇటు అభివృద్ధి, అటు సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తున్నారన్నారు. వైస్ జగన్ పాలనకు ఆకర్షితులైన ఓటర్లు తప్పని సరిగా వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులకే ఓట్లు వేస్తున్నారని, వారి విజయం నల్లేరుపై నడేకనని అన్నారు. విద్య పై సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి మంచి ఫోకస్ పెట్టారని, భవిష్యత్తు తరాల వారికి విద్యనే ఆస్తులుగా ఇవ్వాలన్నదే సీఎం సంకల్పం అన్నారు.

ఏటా రూ.35వేల కోట్లు ఖర్చు: ఎమ్మెల్యే

ప్రభుత్వం ప్రతి ఏటా విద్య పై రూ.35 వేల కోట్లు వెచ్చిస్తున్నారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయంపై సీఎం ఫోకస్ పెట్టారన్నారు. మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదివిన వారే ప్రస్తుత ఎన్నికల్లో అధిక శాతం మంది ఓటర్లు ఉన్నారన్నారు. వారంతా వైఎస్సార్ సీపీ బలపరచిన అభ్యర్థులకే ఓట్లు వేస్తారన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు 85 శాతం ఓట్లతో గెలుపొందు తారన్నారు. నాలుగేళ్లుగా సీఎం వైఎస్ జగన్ పరిపాలన తీరును ప్రజలు పరిశీలిస్తున్నారని, ప్రతి కుటుంబానికి ఈ ప్రభుత్వం ద్వారా ప్రయోజనం చేకూరుతోందన్నారు.

ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

– మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి



పులివెందుల టౌన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేసిన వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎం.వి.రామచంద్రారెడ్డిలను బలపరిచిన ప్రతి ఒక్కరికీ మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పట్టభద్రులకు సంబంధించి 76.40శాతం, ఉపాధ్యాయులకు సంబంధించి 93.40శాతం పోల్ చేసి సహకరించినందుకు ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన పోలీసులకు, అధికారులకు, ఏజెంట్లకు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.


ఎర్రగుంట్ల: ఓటు వేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


చెన్నూరు: ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి


చెన్నూరు: ఓటుహక్కు వినియోగించుకున్న స్కిల్ డెవలప్ మెంట్ చైర్మన్ చల్లా మధుసూదన్‌రెడ్డి


కమలాపురం: ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు


వీరపునాయునిపల్లె: బారులు తీరిన ఓటర్లు


కమలాపురం: పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తున్న సిబ్బంది


వల్లూరు: పోలింగ్ సరళి తెలుసుకుంటున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి


పెండ్లిమర్రి: ఓటింగ్ కోసం బారులు తీరిన పట్టభద్రులు

కమలాపురం: కమలాపురంలో సోమవారం జరిగిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటలకే పోలింగ్ ప్రారంభమైంది. తొలి రెండు గంటలు మందకొడిగా సాగిన పోలింగ్ 10గంటల నుంచి పుంజుకుంది. మొదటి గంటలో 150 ఓట్లు పోల్ కాగా, రెండో గంటకు 306 ఓట్లు పోల్ అయినట్లు సంబంధిత అధికారులు తెలియజేశారు. సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి 1531 పట్టభద్రుల ఓట్లకు గాను 1247 ఓట్లు పోల్ అయ్యాయి. 81శాతం ఓట్లు పోల్ అయినట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

– ఉపాధ్యాయుల ఓట్లు 59 ఉండగా 58 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 98.3శాతం ఉపాధ్యాయుల ఓట్లు పోలయ్యాయి.

– కమలాపురం ఐసీడీఎస్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల, ఉపాధ్యాయుల పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు. అక్కడున్న తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎస్ఐ చిన్నపెద్దయ్యను పోలింగ్ సరళి గురించి అడిగి తెలుసుకున్నారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన డీఎం అండ్ హెచ్:

కమలాపురంలోని పోలింగ్ కేంద్రాలను డీఎం అండ్ హెచ్ఓ నాగరాజు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో వైద్య శాఖ ఏర్పాటు చేసిన శిబిరాన్ని సందర్శించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది ఉన్నా తక్షణం ప్రథమ చికిత్స అందించి సమీపంలోని ఆసుపత్రులకు తరలించాలన్నారు.

మహిళా పోలీస్‌కు అస్వస్థత:

కమలాపురంలో పోలింగ్ ప్రారంభమైన కొద్ది సేపటికే అక్కడ విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీస్ శ్యామల అస్వస్థతకు గురయ్యారు. తోటి పోలీస్ సిబ్బంది సపర్యలు చేసి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

గట్టి బందోబస్తు: ఎమ్మెల్సీ ఎన్నికలకు డీఎస్పీ వాసుదేవన్ ఆధ్వర్యంలో కమలాపురం సీఐ సత్యబాబు, ఎస్ఐ చిన్నపెద్దయ్య పర్యవేక్షణలో పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు.

పెండ్లిమర్రి: పెండ్లిమర్రిలో సోమవారం పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలో 1161 పట్టభద్రుల ఓట్లకు గాను 858 ఓట్లు, 28 ఉపాధ్యాయ ఓట్లకుగాను 28 ఓట్లు పోలైనట్లు తహశీల్దార్ ఉదయభాస్కర్‌రాజు తెలిపారు. ఎన్నికల సరళిని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, సీకెదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిలు పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద కడప రూరల్ సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి బందో బస్తు నిర్వహించారు.

చింతకొమ్మదిన్నె : చింతకొమ్మదిన్నెలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మండలంలో 1761 పట్టభద్రుల ఓట్లు ఉండగా 1380 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే 342 ఉపాధ్యాయ ఓట్లు ఉండగా 327 ఓట్లు పోల్ అయ్యాయని మండల తహశీల్దార్ గంగయ్య అన్నారు. కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి పోలింగ్ కేంద్రానికి వచ్చి పోలింగ్ సరళిని పరిశీలించారు.

వీరపునాయునిపల్లె: ఎన్నికలు సోమవా రం ప్రశాంతంగా ముగిశాయి. ఎస్సై రాజా రమేష్ తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మెంబర్ నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి ఓటు హక్కు వినియోగించుకొన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, తెలుగు దేశం పార్టీ నాయకుడు పుత్తా నరసింహారెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించారు. మండలంలో పట్టభద్రులకు సంబంధించి 877 మంది ఓటర్లు ఉండగా 651మంది ఓటు హక్కు వినియోగించుకొన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి 47మంది ఓటర్లు ఉండగా 42 మంది ఓటు హక్కు వినియోగించుకొన్నారు. మొత్తం మీద 74.23శాతం పట్టభద్రులు, ఉపాధ్యాయులు 91.30శాతం పోలింగ్ నమోదయింది.

చెన్నూరు : చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఆయన తనయుడు, సీకే దిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డిలు ఓటింగ్ సరళిని పరిశీలించారు. స్కిల్ డెవలప్ మెంట్ చైర్మన్ చల్లా మధుసూదన్‌రెడ్డి చెన్నూరులో ఓటుహక్కును వినియోగించుకున్నారు. భద్రతా ఏర్పాట్లను ఫ్యాక్షన్ జోన్ డీఎస్పీ చెంచుబాబు, సీఐలు రామచంద్రయ్య, అశోక్‌రెడ్డిలు పర్యవేక్షించారు. మండల వ్యాప్తంగా 1100 మంది పట్టభద్రులు ఉండగా 925 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు 67 మంది ఉండగా 66 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు.

జమ్మలమడుగు: ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సాయంత్రం నాలుగు గంటలకు 66శాతం పోలింగ్ కాగా ఇంకా ఉపాధ్యాయులు క్యూలో నిలబడ్డారు. అదేవిధంగా పట్టభద్రులకు సంబంధించి ఓటింగ్‌లో ఓటర్లు భారీగా నాలుగు గంటలు దాటినా క్యూలో నిలబడటంతో వారంతా ఓటు హక్కు వినియోగించుకునే వరకు పోలింగ్ ప్రక్రియ నిర్వహించారు.

పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ..

పట్టణంలోని పతంగే రామన్నరావు ఉన్నత పాఠశాలలోని 46, 47వ పోలింగ్ కేంద్రాలను ఎస్పీ అన్బురాజన్ తనిఖీ చేశారు.

ఓటింగ్‌లో పాల్గొన్న నాయకులు...

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ఎర్రగుంట్ల పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి తన కుమారుడు వెంకటశివారెడ్డితో కలిసి పెద్దముడియంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా బీజేపీ నాయకులు ఆదినారాయణరెడ్డి , మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జీ సుబ్బరామిరెడ్డిలు పట్టణంలోని జూనియర్ కాలేజీలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పెద్దముడియం: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రశాంతంగా జరిగినట్లు తహసీల్దార్ రత్న కుమారి తెలిపారు. పట్ట భద్రులు 655 మందికి గాను 531 మంది, ఉపాధ్యాయులు 23 మందికి గాను 23 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తన కుమారుడు శివారెడ్డితో కలిసి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

జమ్మలమడుగు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికలు జమ్మలమడుగు మండలంలో ప్రశాంతంగా జరిగియి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పట్టభద్రులకు కేటాయించిన 48 వ బూత్‌లో దాదాపు 1200 ఓట్లు ఉండటంతో పోలింగ్ దాదాపు 6 గంటల వరకు కొనసాగింది. జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో సీఐ సదా శివయ్య ప్రత్యేక పోలీస్ బందోబస్త్ నిర్వహించారు. జమ్మలమడుగు మండలంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఓట్లు 3309 ఓట్లు ఉన్నాయి. వాటిలో పురుషులు 2148 ఓట్లకు గాను 1668 ఓట్లు నమోదు కాగా మహిళ ఓట్లు 1161 ఓట్లకు గాను 867 ఓట్లు నమోదు అయినట్లు అధికారులు తెలియజేశారు.

జమ్మలమడుగు డివిజన్ పరిధిలో..

జమ్మలమడుగు డివిజన్ పరిధిలో ఉపాధ్యాయ ఓటర్లు 2322 ఉండగా 2165 ఓట్లు నమోదు అయ్యాయి. 93.24 శాతం నమోదు అయ్యాయి. అలాగే పట్టభద్రులు ఓటర్లు 27,844 ఓట్లకు గాను 19,558 ఓట్లు పోల్ అయ్యాయి. దాదాపు 70.46 శాతం పోలింగ్ నమోదైంది.

మైలవరం మండలంలో..

మైలవరం మండలంలో ఉపాధ్యాయ ఓట్లు 82 ఓట్లకు గాను 78 ఓట్లు నమోదయ్యాయి. 95.1 శాతం ఓట్లు నమోదయ్యాయి. పట్టభద్రుల ఓట్లు 1145 కు గాను 905 ఓట్లు నమోదు అయినట్లు మండల తహశీల్దార్ తిరుపతయ్య తెలిపారు.

కొండాపురం: కొండాపురంలోని ప్రాథమిక (మొయిన్) పాఠశాలలో ఉపాధ్యాయులకు ఒక పోలింగ్ కేంద్రం, పట్టభద్రులకు రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పట్టభద్రులు మొత్తం 1465 మంది నమోదు చేసుకోగా 1039 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉపాధ్యాయులు 43 మంది ఓట్లు ఉండగా 41 ఓట్లు పోలైనట్లు తహశీల్దార్ శోభనబాబు తెలిపారు. జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. కొండాపురం సీఐ సుదర్శన్ ప్రసాదు, ఎస్ఐలు సత్యనారాయణ, రవికుమార్ బందోబస్తు నిర్వహించారు.

ఎర్రగుంట్ల : ఎమ్మెల్సీ ఎన్నికలు ఎర్రగుంట్లలో ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల వ్యాప్తంగా 75.61 శాతం ఓట్లు పోల్ కాగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 95.35 శాతం ఓట్లు పోల్ అయినట్లు తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. పట్టభద్రుల పోలింగ్ కేంద్రాలు మూడు ఏర్పాటు చేశారు. ఎర్రగుంట్ల జెడ్పీ బాలుర పాఠశాలలో 43, 44 పోలింగ్ బూతులు, ఆర్టీపీపీలోని డీఏవీ స్కూల్‌లో 45వ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జెడ్పీ బాలికల పాఠశాలలో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 43వ బూత్‌లో మొత్తం 842 ఓట్లు ఉండగా ఇందులో 608 ఓట్లు పోల్ అయ్యాయి. 44వ పోలింగ్ బూత్‌లో 1219 ఓట్లుకు గాను 881 ఓట్లు పోల్ అయ్యాయి. 45వ పోలింగ్ కేంద్రంలో 842 ఓట్లకు గాను 677 ఓట్లు పోల్ అయ్యాయి. మొత్తం 2903 ఓట్లకు గాను 2166 ఓట్లు పోల్ అయ్యాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 216 ఓట్లకు గాను 205 ఓట్లు పోల్ అయ్యాయి. 95.35 శాతం నమోదు అయింది.

పోలింగ్ కేంద్రం పరిశీలన..

ఎర్రగుంట్ల పట్టణంలో పోలింగ్ కేంద్రాలను జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు పరిశీలించారు.

– ఎర్రగుంట్ల పోలింగ్ కేంద్రానికి జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి వచ్చి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాధారణ వ్యక్తి లాగా ఓటర్లతో కలసి క్యూలో నిలబడ్డారు. సుమారు గంటకు పైగానే క్యూలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయనతో పాటు ఎర్రగుంట్ల మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి కూడా క్యూలో నిలబడ్డాడు.

వల్లూరు: కమలాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలో మొత్తం ఆరు మండలాలు ఉండగా పట్టభద్రుల ఓటర్లు మొత్తం 7181 మంది ఉన్నారు. ఇందుకు గానూ చింతకొమ్మదిన్నె , కమలాపురం మండలాల్లో రెండు పోలింగ్ కేంద్రాల చొప్పున, వల్లూరు, చెన్నూరు, పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లె మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున పోలింగ్ కేంద్రాలలో జరిగిన పోలింగ్‌లో 5631 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 78. 41 శాతం పోలింగ్ నమోదైంది.

– నియోజకవర్గం మొత్తం 342 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారు. ఇందుకు గానూ మండలానికి ఒకటి చొప్పున ఆరు మండలాల్లో ఆరు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 327 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో 95. 61 శాతం పోలింగ్ నమోదైంది.

– వల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిలు సందర్శించారు. పోలింగ్ సరళిని పరిశీలించారు. స్థానిక వైఎస్ఆర్‌సీపీ నేతలతో పోలింగ్‌ను గురించి ఆరా తీశారు.

– డీఎస్పీ వాసుదేవన్, సీఐ సత్యబాబు పోలింగ్ కేంద్రాలను పలు మార్లు సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్ఐ విష్ణు వర్ధన్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. తహశీల్దార్ అమరేశ్వరి, ఎంపీడీవో జుబేద పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించారు. వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివకుమార్ రెడ్డి, పలువురు పార్టీ నేతలు పర్యవేక్షించారు.

పులివెందుల టౌన్/ రూరల్ : పులివెందుల పట్టణంలోని పాత బస్టాండు సమీపంలో ఉన్న రమణప్ప సత్రం బడి పాఠశాలలో 75వ పోలింగ్ కేంద్రంలో సోమవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు పోలింగ్ పక్రియను పర్యవేక్షించారు.

– పులివెందుల మండల వ్యాప్తంగా 4463మంది పట్టభద్రుల ఓటర్లుకుగానూ 3074మంది ఓట్లు పోల్ అయ్యి.. 76.40 శాతం, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి సంబంధించి 561మంది ఓటర్లకు గానూ.. 524మంది ఓట్లు వేయగా.. 93.40శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్ సరళిని పరిశీలించిన అడిషనల్ ఎస్పీ :

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను అడిషనల్ ఎస్పీ కృష్ణారావు పరిశీలించారు. పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు, అర్బన్ సీఐ రాజు, ఎస్ఐలు చిరంజీవి, హుస్సేన్‌లు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి గట్టి బందోబస్తు నిర్వహించారు.

సింహాద్రిపురం : సింహాద్రిపురంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికలను మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బీఎన్ బ్రహ్మానందరెడ్డి పర్యవేక్షించారు. అలాగే మండల వ్యాప్తంగా పట్టభద్రులకు సంబంధించి 1109మంది ఓటర్లు ఉండగా.. 857 మంది ఓట్లు వేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 65 మంది ఓటర్లకు గానూ.. 52 ఓట్లు పోలైనట్లు ఆయన తెలిపారు. సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

వేంపల్లె : వేంపల్లెలో ఎన్నికల నిర్వహణను పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డిలు పరిశీలించారు. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐలు రఘురాం, తిరుపాల్ నాయక్‌లు బందోబస్తు ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు 163 మంది ఉండగా.. 153 మంది ఓట్లు వేశారు. 94.50 శాతం పోలైనట్లు అధికారులు తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు 2100మంది ఉండగా.. 1604 మంది ఓట్లు వేయగా.. 76.40శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

వేముల : వేముల మండల వ్యాప్తంగా 1068 పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు ఉండగా.. 814మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 37మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా.. 36 మంది ఓట్లు వేశారు. పట్టభద్రులకు సంబంధించి 76.20 శాతం, ఉపాధ్యాయులకు సంబంధించి 90 శాతం ఓట్లు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలను వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌ఛార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకటబయపురెడ్డి, మండల పరిశీలకుడు లింగాల రామలింగారెడ్డి, పీసీబీ డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

తొండూరు : పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు తొండూరు మండలంలో ప్రశాంతంగా జరిగినట్లు ఎన్నికల అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. తొండూరు మండల వ్యాప్తంగా 920మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా.. అందులో 696 మంది ఓట్లు వేసి 75శాతం పోల్ నమోదు కాగా.. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 50ఓట్లకు గానూ.. 49 మంది ఓట్లు వేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

– ఉదయం పోలింగ్ ప్రారంభంలోనే వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. దీంతో సీఐ బాల మద్దిలేటి, ఎస్ఐ హనుమంతులు ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా ఇరువురిని మందలించారు. అనంతరం మధ్యాహ్న సమయంలో ఓటింగ్ సరళి సక్రమంగా జరుగుతుండటంతో టీడీపీ నాయకులు జీర్ణించుకోలేక వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై ఘర్షణకు దిగారు. దీంతో అడిషనల్ ఎస్పీ కృష్ణారావు వచ్చారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టి ఎన్నికలు సజావుగా జరిగేలా చేశారు.

చక్రాయపేట: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా చక్రాయపేట మండలంలో 76 శాతం ఓట్లు పోలయ్యాయి. 1031మంది పట్ట భద్రులకు గాను 781మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి రాజసింహ నరేంద్ర తెలిపారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 36 మందికి గాను 35 మంది తమ ఓటు హక్కును విని యోగించుకున్నట్లు ఆయన తెలిపారు. వేంపల్లె సీఐ వెంకటేశ్వర్లు, చక్రాయపేట ఎస్సై మల్లికార్జునరెడ్డిలు పోలింగ్ కేంద్రం వద్ద తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

లింగాల : లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియలో.. మధ్యాహ్నం 1.30గంటల ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం జరిగింది. సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ హృషికేశవరెడ్డిలు జోక్యం చేసుకుని ఇరువర్గాలతో మాట్లాడి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహింపజేశారు. అదే సమయంలో టీడీపీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పోలింగ్ కేంద్రానికి రావడంతో సీఐ ఆయనను అదుపులోకి తీసుకుని ఎలాంటి ఘర్షణ జరగకుండా నివారించారు.

దీంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ 34వ కేంద్రంలో 33 ఓట్లు ఉండగా.. వందశాతం ఓట్లు పోల్ అయ్యాయి. అదేవిధంగా పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి 80వ పోలింగ్ కేంద్రంలో 832 మంది ఓట్లు వేయాల్సి ఉండగా.. 727 ఓట్లు పోల్ అయ్యి.. 87.30శాతం ఓట్లు పోల్ అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రాలను ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణారావు, ఆర్డీఓ వెంకటేశులు, డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు.

ముద్దనూరు: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఉదయం 8నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యాయులు, పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 24వ పోలింగ్ బూత్‌లో మొత్తం 84 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా అందులో 81 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 52వ పోలింగ్ బూత్‌లో 1133 మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా.. అందులో 777 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు పోలింగ్ అధికారి తెలిపారు. ఎన్నికల బందోబస్తును డీఎస్పీ నాగరాజు పర్యవేక్షించారు. స్థానిక తహశీల్దారు వెంకటేశ్వర్లు, ఎస్ఐ చంద్రమోహన్ పోలింగ్ సరళిని పరిశీలించారు.


జమ్మలమడుగు: ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎస్పీ అన్బురాజన్


చక్రాయపేటలో...


ఎర్రగుంట్లలో...


లింగాల : క్యూలో నిలబడిన ఓటర్లు


ముద్దనూరులో...


జమ్మలమడుగులో...


సింహాద్రిపురంలో...


తొండూరులో...


పులివెందులలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ కృష్ణారావు


వేంపల్లెలో...


పులివెందులలో...